ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
ఆదివారం 4 ఆగస్టు 2024



6న సూపర్-60 ప్రవేశ పరీక్ష

సీతంపేట: ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూపర్ -60లో ప్రవేశానికి ఈ నెల 6న ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీవోఈ మల్లి, సీతంపేట ఆర్‌జేసీ బాయ్స్ కళాశాల, ఆర్‌జేసీ గర్ల్స్ కాలేజీ, పెద్దమడి ఆర్‌జేసీ బాయ్స్ కళాశాలలో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఈ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. జిల్లాలో టెన్త్ పాసైన గిరిజన విద్యార్థులు సూపర్-60లో ప్రవేశానికి అర్హులని తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఈ 82476 08256 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

నెట్‌వర్క్ సమస్య
సేవలకు విఘాతం



- ఏజెన్సీ సచివాలయాల్లో సక్రమంగా పనిచేయని ఫైబర్ నెట్
- రెండున్నరేళ్లుగా ఇబ్బందులు పడుతున్న గిరిజనులు
- సిగ్నల్స్ కోసం ఉద్యోగుల పాట్లు
- దృష్టిసారించని గత వైసీపీ సర్కారు
- నూతన ప్రభుత్వం స్పందించాలని విన్నపం

(జియ్యమ్మవలస)

ఏజెన్సీ ప్రాంతాల్లోని పలు సచివాలయల్లో ఏర్పాటు చేసిన ఫైబర్ నెట్ సరిగ్గా పనిచేయడం లేదు. రెండున్నరేళ్లుగా ఇదే పరిస్థితి. దీంతో ప్రజలకు అందాల్సిన సేవలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. మరోవైపు సిగ్నల్స్ కోసం ఉద్యోగులు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం.. స్థానిక నెట్ సిబ్బంది పనితీరే ఇందుకు కారణమనే వ్యాఖ్యలు సర్వత్రా వినిపిస్తున్నాయి. జియ్యమ్మవలస మండలం విషయానికొస్తే.. ఏజెన్సీ పంచాయతీలైన టీకే జమ్ము, పీటీ మండ, కొండ చిలకాంలో మొత్తంగా 22 గిరిజన గ్రామాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లోని సచివాలయాల్లో ఏపీ ఫైబర్ నెట్ ఏర్పాటు చేశారు. కానీ గత రెండున్నరేళ్లుగా ఫైబర్ నెట్ సరిగ్గా పని చేయడం లేదు. దీంతో గిరిజన గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి సచివాలయాల ద్వారా ప్రజలకు 312 రకాల సేవలు అందాల్సి ఉంది. కానీ ఈ మూడు పంచాయతీలకు ఫైబర్ నెట్ సక్రమంగా పనిచేయడం లేదు. దీనికి ప్రధాన కారణం ఫైబర్ నెట్ ఉద్యోగుల నిర్లక్ష్యమేనని అధికారులు, సర్పంచ్‌లు, గిరిజనులు ఆరోపిస్తున్నారు. మరోవైపు కొంతమంది సచివాలయ ఉద్యోగులు సెల్ ఫోన్ల ద్వారానైనా సేవలందించాలని సిగ్నల్స్ కోసం ఘాట్ రోడ్డుకు పరుగులు తీస్తున్నారు. దీనిపై ఐటీడీఏ పీవో, కలెక్టర్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.



టీకే జమ్ము కార్యదర్శిని నిలదీస్తున్న గిరిజనులు (ఫైల్)

ఫైబర్ నెట్ పనిచేయని గ్రామాలివే..

కూటం, పాంద్రసింగి, కోడిపిల్లగూడ, గోర్లి, గోర్లివలస, టీకే జమ్ము, నడిమి సిరిపి, పల్లపు సిరిపి, జమ్మువలస, పీటీ మండ, చాపరాయిగూడ, బాపన్నగూడ, దీసరిగూడ, ద్రాక్షిణి, పెదదోడిజ, చినదోడిజ, చిలకాంవలస, కొండచిలకాం, బల్లేరుగూడ, బల్లేరు, కిడిగేసు, కొండనిడగళ్లు.

అందని సేవలు..

ఆయా గ్రామాల్లో గిరిజనులకు సచివాలయాల ద్వారా ఆదాయ, కుల, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ కావడం లేదు. ఆధార్ వెరిఫికేషన్ జరగడం లేదు. దుకాణాల రిజిస్ట్రేషన్, వాహన మిత్ర సర్టిఫికెట్లు కూడా పొందలేని పరిస్థితి. పంట వివరాలు అప్‌లోడ్, కులగణన సర్వే, సంక్షేమ పథకాల పేర్ల మార్పు వంటివేవీ జరగడం లేదు. ఉద్యోగులకు మెడికల్ సర్టిఫికెట్లకు కూడా చిక్కులు తప్పడం లేదు. వాస్తవంగా ప్రతి సర్టిఫికెట్‌ను నిర్ణత గడువులోగా అర్జీదారునికి జారీ చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సచివాలయ సిబ్బంది మండల కేంద్రం, లేదా నెట్ సదుపాయం ఉన్న సమీపంలోని గ్రామ సచివాలయానికి వెళ్లి పనులు చేయాల్సి వస్తోంది.

పనిచేయడం లేదు..

సచివాలయం ద్వారా సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ఏపీ ఫైబర్ నెట్ సరిగ్గా పరిచేయడం లేదు. రెండున్నరేళ్ల నుంచి ఆదే పరిస్థితి.

-ఆరిక శారద, సర్పంచ్, పీటీ మండ

ఇబ్బందులు పడుతున్నారు..

ఏపీ ఫైబర్ నెట్ పుణ్యమా అని మా పంచాయతీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెట్ సరిగ్గా పనిచేయకపోవడంతో వారికి పూర్తిస్థాయిలో సేవలు అందడం లేదు. దీంతో మమల్ని తిట్టుకునే పరిస్థితి ఏర్పడింది.

-అడ్డాకుల భారతి, సర్పంచ్, టీకే జమ్ము

కలెక్టర్ స్పందించాలి..

టీకే జమ్ము, పీటీ మండ, కొండచిలకాం పంచాయతీల్లో ఏపీ ఫైబర్ నెట్ పరిస్థితి దారుణంగా ఉంది. సరిగ్గా పనిచేయకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. దీనిపై కలెక్టర్ స్పందించి తగు చర్యలు తీసుకోవాలి.

-సుమతి, ఎంపీటీసీ సభ్యురాలు, కొండచిలకాం

చర్యలు తీసుకుంటాం..

ఏజెన్సీ ప్రాంతాల్లో ఏపీ ఫైబర్ నెట్ పనిచేయడం లేదని సర్పంచ్‌ల ద్వారా తెలిసింది. యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటాం. గిరిజనులు ఇబ్బందులు పడకుండా చూస్తాం.

-పి.శ్రీనివాసరావు, ఎంపీడీవో, జియ్యమ్మవలస

మాతాశిశు మరణాల నివారణకు చర్యలు

- 'డయల్ విత్ హైరిస్క్ ప్రెగ్నెంట్'కు శ్రీకారం
- ఐటీడీఏ పీవో రాహుల్‌కుమార్‌రెడ్డి


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో రాహుల్‌కుమార్ రెడ్డి

సీతంపేట, ఆగస్టు 3: గిరిజన ప్రాంతాల్లో మాతాశిశు మరణాల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నట్లు సీతంపేట ఐటీడీఏ పీవో టి.రాహుల్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. దీనిలో భాగంగానే డయల్ విత్ హైరిస్క్ ప్రెగ్నెంట్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. శనివారం తన కార్యాలయంలో విలేఖర్లతో మాట్లాడుతూ.. 'ఈ నెలలో 460 మంది గిరిజన గర్భిణులు ప్రసవానికి సిద్ధంగా ఉన్నట్టు నివేదికలు అందాయి. వీరిలో 60మంది గర్భిణులు హైరిస్క్‌లో ఉన్నారు. ఈ నేపథ్యంలో గిరిజన ప్రాంతాల్లో ఎటువంటి మరణాలు సంభవించకుండా ముందస్తుగా చర్యలు తీసుకుంటున్నాం. పది రోజుల్లో స్థానిక వైటీసీలో గర్భిణుల వసతిగృహాన్ని ఏర్పాటు చేస్తాం. ఇందులో 20 మంది వరకు ఉండే విధంగా చర్యలు తీసుకుంటాం. వారికి రోజూ పౌష్టికాహారం అందిస్తాం. ఇందుకోసం ఒక్కొక్కరికి రూ.150 చొప్పున వెచ్చిస్తాం. దోనుబాయి పీహెచ్‌సీకి అంబులెన్స్ సౌకర్యం కల్పిస్తున్నాం. 18 మంది వైద్య సిబ్బందిని నియమిస్తాం. వారపు సంతల్లో మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తాం. మందుల కొరత లేకుండా చూస్తాం. గిరిజన ప్రాంతాల్లో పౌష్టికాహారం పెంపొందించేందుకు, పరిసరాల పరిశుభ్రతకు అన్ని శాఖల అధికారుల భాగస్వాములను చేస్తూ.. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. రూ.ఆరున్నర లక్షలతో సీతంపేట ఏరియా ఆసుపత్రిలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తాం. అబ్దుల్‌కలాం పేరుతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి కాంపిటేటివ్ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచుతాం. గిరిజన యవతకు ఫుడ్ ప్రాసెసింగ్, ఏఈఎంఎల్, టూరిజం వంటి కోర్సులను ఏర్పాటు చేస్తాం. నిరుద్యోగుల అవసరార్థం ఒక యాప్‌ను రూపొందిస్తాం. గిరిజన ప్రాంతాల్లో జీవన ఉపాధి మెరుగుకు చర్యలు తీసుకుంటాం. ప్రతి గ్రామానికి రహదారుల సౌకర్యం కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. డోలీ మోతల కష్టాలు తప్పిస్తాం. డీఎస్సీని దృష్టిలో పెట్టుకొని మందస, సీతంపేట ప్రాంతాల్లో 200 మందికి కోచింగ్ ఇస్తాం. టెట్ అర్హత లేకపోయినా పర్వాలేదు. దీనికి సంబంధించి ఈ నెల 5 నుంచి 12వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తాం. ఇటీవల కాలంలో ఎనిమిది డెంగ్యూ కేసులు నమోదు అయ్యాయి. దాని నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. ఆడలి వ్యూపాయింట్ నుంచి ముఖలింగం పుణ్యక్షేత్రానికి వెళ్లడానికి వీలుగా బోటు షికారును ఏర్పాటు చేస్తాం. ఎన్టీఆర్ అడ్వంచర్‌పార్క్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం' అని పీవో తెలిపారు.


పూజలందుకున్న కోటదుర్గమ్మ

9 నుంచి శ్రావణమాస మహోత్సవాలు

- కోటదుర్గమ్మ ఆలయంలో ఏర్పాట్లు

పాలకొండ, ఆగస్టు3: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో ఈ నెల 9 నుంచి శ్రావణ మాసోత్సవాలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు డి.లక్ష్మీ ప్రసాద్ శర్మ, ఈవో బి.మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనతో తెలిపారు. ఈ నెల 9, 16, 23, 30 తేదీల్లో ఆలయంలో శ్రావణమాస సామూహిక లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పంచామృతాభిషేకం, అర్చన, నీరాజనం, మంత్రం పుష్పాలు, దశవిధి మంగళహారతులతో అమ్మవారికి ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. భక్తులు తరలి వచ్చి పూజల్లో పాల్గొనాలని కోరారు.

గ్రామాల్లో రక్త పరీక్షలు చేయండి

- వైద్యశిబిరాలు నిర్వహించాలి
- వైద్యాధికారులకు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశం

పార్వతీపురం రూరల్, ఆగస్టు 3: గ్రామాల్లో వ్యాధులు, వైరల్ ఫీవర్లు ప్రబలకుండా రక్త పరీక్షలు చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం డోకిశీల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీచేశారు. జ్వరాలతో పీహెచ్‌సీకి వచ్చిన వారితో మాట్లాడారు. అక్కడ ఉన్న తానవలస గ్రామ చిన్నారులకు దగ్గరుండి ఆర్‌డీటీ రక్త పరీక్షలు చేయించి.. ఫలితాలను పరిశీలించారు. మలేరియా జ్వరం అని తేలడంతో వెంటనే మెరుగైన చికిత్స అందించాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో మలేరియా, డెంగ్యూ జ్వరాలు తీవ్రం కాకుండా చూడాలని, అనుమానితులను స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. జ్వరాల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర మున్న చోట వైద్య శిబిరాలను నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం పీహెచ్‌సీలో మందుల నిల్వలపై ఆరా తీశారు. లేబర్, జనరల్‌వార్డు, ఆపరేషన్ గదులు, రన్నింగ్ వాటర్ సదుపాయాన్ని పరిశీలించారు.


డోకిశిల పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

పరిశుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ..

పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోచ్చని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ తెలిపారు. మారుమూల గిరిజన గ్రామమైన జిల్లేడువలసలో ఆయన పర్యటించారు. ఇంటింటా తిరిగి పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. కాలువల్లో నీటి నిల్వను పరిశీలించి క్లోరినేషన్ పనులు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి తిరుపతిని ఆదేశించారు. జనావాసాల్లో ఖాళీ కొబ్బరి బొండాలు, టైర్లు ఉండరాదన్నారు. వాటి వల్ల దోమలు వృద్ధి చెంది డెంగ్యూ వంటి జ్వరాలు వచ్చే ప్రమాదముందని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహారం, హాజరును పరిశీలించారు. కొంతమంది చిన్నారులు ఎందుకు హాజరుకాలేదని ప్రశ్నించారు. పొలం పనులకు తల్లిదండ్రుల వెంట వెళ్లారని అంగన్‌వాడీ కార్యకర్త తెలిపారు. కాగా పిల్లలు క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామంలోని తాగునీటి పథకం, అంగన్‌వాడీ కేంద్రం కోసం నివేదికలు అందిన వెంటనే మంజూరు చేస్తానని తెలిపారు. ఈ పరిశీలనలో సర్పంచ్ దిబ్బన్న, ఎంపీడీవో షేక్ అబ్దుల్ జావేద్, సహాయ మలేరియా అధికారి డి.సూర్యనారాయణ, పీవో ఆర్బీకే రఘు, పీహెచ్‌సీ వైద్యులు ఐశ్వర్య, కౌశిక్, వీఆర్వో మనోజ్‌చౌదరి, ఏఎన్ఎం విజయశైలజ ఉన్నారు.

దూర విద్య ప్రవేశాలకు నమోదు తప్పనిసరి

పార్వతీపురం, ఆగస్టు3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం 2024-25 విద్యా సంవత్సరానికి గాను టెన్త్, ఇంటర్ దూర విద్య ప్రవేశాలకు పేర్లు నమోదు చేసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ప్రకటించారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. చదువు మధ్యలో మానేసిన వారిని గుర్తించి.. లక్ష్యం మేర నమోదు ప్రక్రియ చేపట్టాలని విద్యాశాఖాధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో ఆర్.కేశవనాయుడు, డీఈవో జి.పగడాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



విమానం వచ్చిందని..

భామిని మండలం దిమ్మిడిజోలలో విమానం ఏమిటి?.. అక్కడకు అదెలా వచ్చిందని అనుకుంటున్నారా!.. వాస్తవంగా ఈ చిత్రంలో కనిపిస్తున్నది కాలం చెల్లిన విమానం. దీనిని 36 చక్రాల భారీ వాహనంలో కోల్‌కతా నుంచి చెన్నైకు తరలిస్తున్నారు. అయితే శనివారం ఆ వాహనం దిమ్మిడిజోల సమీపంలోకి చేరుకుంది. రోడ్డుపక్కనే దానిని నిలిపి వాహన డ్రైవర్లు, ఇతర సిబ్బంది విశ్రాంతి తీసుకున్నారు. తొలుత దానిని ఎవరూ పట్టించుకోలేదు. తర్వాత కాలం చెల్లిన విమానం తరలిస్తున్నారని తెలియడంతో దిమ్మిడిజోలతో పాటు సమీప గ్రామాలైన అనంతగిరి, గజపతినగరం, లోవగూడల నుంచి చిన్నారులు, పెద్దలు, మహిళలు భారీగా అక్కడకు తరలివచ్చారు. సెల్ఫీలు, ఫొటోలు దిగారు. సాయంత్రం వరకు అక్కడే సరదాగా గడిపారు.

-భామిని

చివరికి కష్టమేనా?

- తోటపల్లి ఎడమ కాలువ నుంచి శివారు భూములకు అందని సాగునీరు
- ఐదేళ్లుగా మరమ్మతులు, పూడికతీతకు నోచని కాలువలు
- వాటి నిర్వహణను గాలికొదిలేసిన గత వైసీపీ సర్కారు
- ఏటా రైతులకు తప్పని ఇబ్బందులు
- నూతన ప్రభుత్వంపైనే ఆశలు

కిమ్మి గ్రామంలో పిచ్చి మొక్కలతో నిండిన కాలువ


వీరఘట్టం, ఆగస్టు3: వీరఘట్టం మండలంలో తోటపల్లి ఎడమ కాలువ సబ్ చానల్ నుంచి శివారు భూములకు సాగునీరు అందడం లేదు. దీంతో ఆయకట్టుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏటా కాలువ ఎగువ గ్రామాలైన రావివలస, కడకెల్ల, నడిమికెల్ల, విక్రంపురం, చిట్టిపుడివలస, నడుకూరులో వరినాట్లు పూర్తయిన తర్వాత శివారు గ్రామాలకు సాగునీరు చేరుతుంది. మరోవైపు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో ఏటా ఆయా ప్రాంత రైతులకు అవస్థలు తప్పడం లేదు. పూర్తిస్థాయిలో నీరు రాకపోవడంతో వరుణుడిపై ఆధారపడి సాగు చేపట్టాల్సి వస్తోంది. వాస్తవంగా గత వైసీపీ సర్కారు కాలువల నిర్వహణను గాలికొదిలేసింది. మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్‌కు నిధులు మంజూరు చేయలేదు. దీంతో మండల పరిధిలో సాగునీటి కాలువలు అధ్వానంగా మారాయి. ప్రస్తుతం కిమ్మి, కొట్టుగుమ్మడ, గడగమ్మ గ్రామాలకు సాగునీరు అందడం లేదు. దీంతో శివారు ప్రాంత రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. 'వరి నారుమళ్లు సిద్ధం చేసి నెల రోజులు గడుస్తుంది.. ఇంకా నాట్లు వేయడం ఆలస్యమైతే పంట దిగుబడి తగ్గుతుంది.' ఎగువ ప్రాంతంలో నాట్లు పూర్తయ్యేసరికి మరో పది రోజులు పట్టే అవకాశం ఉంది. ఆతర్వాతే దిగువ ప్రాంతానికి నీరు వస్తుంది.' అని కాలువ దిగువ ప్రాంత ఆయకట్టుదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


నీరు లేక వరినాట్లు వేయని పొలం

ఏటా ఇంతే..

ఏటా సాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మా గ్రామ పంట పొలాలకు పూర్తిస్థాయిలో నీరు అందడం లేదు. వర్షాలు బాగా కురిస్తే.. కొంతవరకు పర్వాలేదు. అధికారులు స్పందించి.. కాలువలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి శివారు గ్రామాలకు నీరు అందించేలా చర్యలు తీసుకోవాలి.

-విశ్వేశ్వరరావు, రైతు, కిమ్మి

దిగుబడి తగ్గుతుంది..

వరి నారుమడులు వేసి 25 రోజులు కావస్తోంది. ఇంకా నాట్లు వేయడం ఆలస్యమైతే పంట దిగుబడి తగ్గే అవకాశం ఉంది. అధికారులు చోద్యం చూస్తున్నారు తప్ప కాలువల మరమ్మతులు మాత్రం చేపట్టడం లేదు.

-సూర్యనారాయణ, రైతు, కిమ్మి

పనులు చేపడతాం..

గత వైసీపీ ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో ఐదేళ్లుగా సాగునీటి కాలువల్లో పూడికలు, పిచ్చిమొక్కల తొలగింపు చర్యలు చేపట్ట లేదు. దీంతో శివారు భూములకు నీరు చేరడం లేదు. కాలువల పరిస్థితిని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెండు మూడురోజుల్లో పనులు చేపడతాం.

-రాజేష్, ఏఈ, నీరుపారుదల శాఖ, వీరఘట్టం

ఆంధ్ర యూనివర్సిటీలో డిస్టెన్స్, ఆన్‌లైన్ ప్రోగ్రామ్‌లు



విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(ఏయూ-సీడీఓఈ) ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(ఎస్‌డీఈ)- ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్, ఆన్‌లైన్ మోడ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది.

అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు: బీఏ, బీకాం, బీఎస్సీ డిగ్రీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఆరు సెమిస్టర్లు ఉంటాయి. బీఎస్సీ ప్రోగ్రామ్‌ను ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. మిగిలినవాటిని ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో చదువుకోవచ్చు.

- **బీఎస్సీ గ్రూప్ సబ్జెక్టులు:** మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, స్టాటిస్టిక్స్, బోటనీ, జువాలజీ
- **అర్హత:** బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూప్‌తో ఇంటర్/రెండేళ్ల ఐటీఐ/పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులు; వెటర్నరీ/అగ్రికల్చర్ డిప్లొమా పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఏపీఓఎస్/ఎన్ఐఓఎస్ అభ్యర్థులు కూడా అర్హులే. బీఎస్సీ(ఎంపీసీ/ఎంపీసీఎస్/ఎంస్టాట్‌సీఎస్) కోర్సులకు పాలిటెక్నిక్ డిప్లొమా/ఇంటర్(ఎంపీసీ)ఉత్తీర్ణులు; మేథమెటిక్స్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసిన ఒకేషనల్ అభ్యర్థులు అర్హులు. బీఎస్సీ(సీబీజడ్) కోర్సుకు ఇంటర్(బైపీసీ)/డిప్లొమా(వెటర్నరీ/అగ్రికల్చర్) ఉత్తీర్ణులు; సైన్స్‌లో బ్రిడ్జ్ కోర్సు పూర్తిచేసిన ఒకేషనల్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సులు: ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ, ఎంసీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి.

- **ఎంఏ స్పెషలైజేషన్‌లు:** తెలుగు, ఇంగ్లీష్, ఎకనామిక్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హిస్టరీ, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్స్, ఫిలాసఫీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, మేథమెటిక్స్
- **ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు:** సైకాలజీ, మేథమెటిక్స్, బోటనీ, ఫిజిక్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, జువాలజీ
- **ఎంబీఏ స్పెషలైజేషన్‌లు:** హెచ్ఆర్ఎం, ఫైనాన్స్, మార్కెటింగ్
- **అర్హత:** ఎంసీఏలో ప్రవేశానికి బీటెక్(సీఎస్ఈ)/బీసీఏ ఉత్తీర్ణులు; ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి బీఎస్సీ/బీకాం/బీఏ పూర్తిచేసినవారు; బీఏ/బీకాం ఉత్తీర్ణతతోపాటు ఏయూ నుంచి పీజీడీసీఏ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. మిగిలిన ప్రోగ్రామ్‌లకు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. (ఎంఏ/ఎమ్మెస్సీ)(మేథమెటిక్స్), ఎమ్మెస్సీ(బోటనీ/ఫిజిక్స్/ఆర్గానిక్ కెమిస్ట్రీ/జువాలజీ), ఎంఏ(హిందీ) ప్రోగ్రామ్‌లకు మాత్రం డిగ్రీ స్థాయిలో సంబంధిత స్పెషలైజేషన్ సబ్జెక్ట్ చదివి ఉండాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.andhrauniversity-sde.com

జేఎన్‌టీయూకేలో స్పాన్సర్డ్ ఎంటెక్

కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)- స్పాన్సర్డ్ కేటగిరీ కింద ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. కాకినాడ, నర్సరావుపేట క్యాంపస్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. అకడమిక్ మెరిట్, గేట్ 2024/జీప్యాట్ 2024/పీజీఈసెట్ 2024 ర్యాంక్, అనుభవం, కౌన్సెలింగ్‌ల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. స్పెషలైజేషన్‌కు అయిదు సీట్లు చొప్పున మొత్తం 125 సీట్లు ఉన్నాయి. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు స్కాలర్‌షిప్‌లు, స్టయిపెండ్ లభించవు.

ఎంటెక్ విభాగాలు-స్పెషలైజేషన్‌లు: సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్, బయోటెక్నాలజీ, నానోటెక్నాలజీ, రిమోట్ సెన్సింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఏవియానిక్స్, ఎన్విరాన్‌మెంటల్ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ.

అర్హత: ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి సంబంధిత ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్/ఏఎంఐఈ పూర్తిచేసి ఉండాలి. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన ప్రకారం ఎంసీఏ లేదా ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్/స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్/అప్లయిడ్ స్టాటిస్టిక్స్/అప్లయిడ్ ఫిజిక్స్/జియో ఫిజిక్స్/కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్/కంప్యూటర్ అప్లికేషన్స్ అండ్ ఎలక్ట్రానిక్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్/కెమిస్ట్రీ/బయో కెమిస్ట్రీ/మైక్రోబయాలజీ/బయోటెక్నాలజీ/లైఫ్ సైన్సెస్/ఎర్త్ సైన్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్/డెయిరీ టెక్నాలజీ) ఉత్తీర్ణులు; ఎంబీబీఎస్/బీడీఎస్/బీ ఫార్మసీ/బీవీఎస్సీ పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. డిగ్రీ/పీజీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. గేట్ 2024/జీప్యాట్ 2024/పీజీఈసెట్ 2024 అర్హత తప్పనిసరి. అభ్యర్థులకు కనీసం ఏడాది ప్రొఫెషనల్ అనుభవం ఉండాలి. స్పాన్సర్‌షిప్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

ముఖ్య సమాచారం

- **సెమిస్టర్ ఫీజు:** రూ.25,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 23
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

దిక్సూచి DIKSUCHI

బయోటెక్నాలజీ, సైన్సెస్ విభాగాల్లో పీజీ చేయాలనుకొనే వారి కోసం ఉద్దేశించిన 'జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ మాస్టర్స్(జామ్) 2025' షెడ్యూల్ వెలువడింది. దీనిని ఈ ఏడాది ఐఐటీ ఢిల్లీ నిర్వహిస్తోంది. ఈ పరీక్షలో సాధించిన స్కోర్ ద్వారా ఎమ్మెస్సీ; ఎమ్మెస్సీ(టెక్); ఎంఎస్(రీసెర్చ్); జాయింట్/డ్యూయల్ డిగ్రీ ఎమ్మెస్సీ-పీహెచ్‌డీ; ఎమ్మెస్సీ-ఎంటెక్ డ్యూయెల్ డిగ్రీ; ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న 21 ఐఐటీలు అందిస్తున్న వివిధ పీజీ ప్రోగ్రామ్‌లలో సుమారు 3000 సీట్లను జామ్ స్కోర్ ద్వారా నేరుగా భర్తీ చేస్తారు. అలాగే నిట్ సంస్థలు, ఐసర్లు, ఐఐఎస్సీ, ఐఐఈఎస్‌టీ, డీఐఏటీ, ఐఐపీఈ, జేఎన్‌సీఏఎస్ఆర్, ఎస్ఎల్ఐఈటీ సహా ప్రముఖ సీఎఫ్‌టీఐ సంస్థల్లో 2300కు పైగా ఉన్న సీట్ల భర్తీకి కూడా ఈ స్కోరునే ప్రామాణికంగా తీసుకుంటారు.

సైన్స్ పీజీల్లో ప్రవేశానికి జామ్

జామ్ పేపర్లు: జామ్ ఎగ్జామ్‌ను ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో నిర్వహిస్తారు. ఉదయం సెషన్‌లో కెమిస్ట్రీ, జియాలజీ, మేథమెటిక్స్ పేపర్లు; మధ్యాహ్నం సెషన్‌లో బయోటెక్నాలజీ, ఎకనామిక్స్, మేథమెటికల్ స్టాటిస్టిక్స్, ఫిజిక్స్ పేపర్లు ఉంటాయి. అభ్యర్థులు గరిష్ఠంగా రెండు పేపర్లు రాయవచ్చు. రెండు పేపర్లు రాసేవారు ఉదయం సెషన్ నుంచి ఒక పేపర్, మధ్యాహ్నం సెషన్ నుంచి మరో పేపర్ ఉండేలా చూసుకోవాలి. పేపర్లకు నిర్దేశించిన సిలబస్‌ను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. కెమిస్ట్రీ పేపర్ సిలబస్ మారినందున దానిని త్వరలోనే అప్‌లోడ్ చేస్తారు.

అర్హత: అభ్యర్థి జామ్‌లో ఎంచుకొన్న పేపర్/పేపర్లను అనుసరించి సంబంధిత సబ్జెక్టులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు; సంబంధిత ఇండియన్ డిగ్రీ పూర్తిచేసిన విదేశీ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు. ఒక అభ్యర్థి ఎన్నిసార్లయినా జామ్ ఎగ్జామ్ రాయవచ్చు.

- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** సెప్టెంబరు 3
- **దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 11
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** 2025 జనవరిలో
- **జామ్ 2025 ఎగ్జామ్ తేదీ:** 2025 ఫిబ్రవరి 2
- **వెబ్‌సైట్:** jam2025.iitd.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/gudU4Skలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



యుద్ధానికి సిద్ధం

అడివిశేష్ హీరోగా నటించిన 'గూఢచారి' సినిమాకి కొనసాగింపుగా వస్తోన్న చిత్రం 'గూఢచారి 2'. వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, అభిషేక్ అగర్వాల్, అనిల్ సుంకర నిర్మిస్తున్నారు. 'గూఢచారి' చిత్రం విడుదలై ఆరేళ్లు అవుతున్న సందర్భంగా పార్ట్ 2 నుంచి ఆరు స్టైలిష్ యాక్షన్ స్టిల్స్‌ను శనివారం యూనిట్ విడుదల చేసింది. 'గూఢచారి 2' భారీ స్థాయిలో అంతర్జాతీయ ప్రమాణాలతో తెరకెక్కుతోంది' అని శేష్ చెప్పారు. ఇప్పటికి 40 శాతం షూటింగ్ పూర్తయిందని నిర్మాతలు తెలిపారు.



రెడ్‌కార్పెట్ లుక్

'69వ శోభా ఫిల్మ్‌ఫేర్ అవార్డ్స్ సౌత్ 2024' వేడుక శనివారం రాత్రి హైదరాబాద్‌లో అట్టహాసంగా జరిగింది. హీరోలు నాని, సుధీర్‌బాబు, సందీప్ కిషన్, అల్లు శిరీష్, నవీన్ పొలిశెట్టి, సిద్ధార్థ్... హీరోయిన్లు పాయల్ రాజ్‌పుత్, ఐశ్వర్యా రాజేశ్, జ్యోతిక, నభానటేశ్, రాశీఖన్నా, ప్రియమణి తదితరులు పాల్గొన్నారు.

లావణ్యే డ్రగ్స్ అలవాటు చేసింది

● రాజ్‌తరుణ్ మాజీ ప్రియురాలిపై కేసు

రాజ్‌తరుణ్, ఆయన మాజీ ప్రియురాలు లావణ్య మధ్య నడుస్తున్న వివాదం కొత్త మలుపు తీసుకుంది.



లావణ్య తనకు డ్రగ్స్ అలవాటు చేసిందంటూ ప్రీతీ అనే యువతి నార్సింగి పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. 'లావణ్య ఇప్పటికే చాలామంది అమ్మాయిలకు డ్రగ్స్ అలవాటు చేసింది, తరచూ నాకు ఫోన్‌చేసి బెదిరిస్తోంది, ఆమెవల్ల ఇప్పటికే చాలా జీవితాలు నాశనం అయ్యాయి' అని ప్రీతి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై సుఖేందర్‌రెడ్డి తెలిపారు. డ్రగ్స్ విషయంలో అడ్డు చెప్పడం వల్లే ఆమె రాజ్‌తరుణ్‌పై కక్ష పెంచుకుందని ఆయన తరఫు లాయర్ మధుశర్మ చెప్పారు.

వయనాడ్ విలయం... సినీతారల సాయం



కేరళ సీఎం సహాయక నిధికి రూ. 25 లక్షల సాయం అందించిన మలయాళ నటుడు మోహన్‌లాల్ సహాయక చర్యల్లో సైతం పాల్గొని తన గొప్ప మనసు చాటుకున్నారు. టెరిటోరియల్ ఆర్మీలో లెఫ్టినెంట్ కల్నల్‌గా కొనసాగుతున్న ఆయన ఆ హోదాలో దగ్గరుండి సహాయ కార్యక్రమాలను పర్యవేక్షించారు. వయనాడ్‌లోని ఆర్మీ బేస్ క్యాంప్‌లో ఆయన సైనికులను కలిశారు. తాత్కాలిక బ్రిడ్జిల నిర్మాణం లాంటి కార్యక్రమాల్లో సైనికులతో కలసి పాల్గొన్నారు. 'మీరు రీల్ హీరో కాదు రియల్ హీరో' అంటూ నెటిజన్లు మోహన్‌లాల్‌ను ప్రశంసిస్తున్నారు.



నటీనటుల విరాళాలు

భారీ వరదలు, కొండ చరియలు విరిగిపడి తీవ్రంగా నష్టపోయిన వయనాడ్ ప్రాంతంలో సహాయ, పునరావాస కార్యక్రమాలకు తమవంతు సాయం అందించేందుకు తారాలోకం నడుంకట్టింది. పలువురు నటీనటులు ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు ఇస్తున్నారు. టాలీవుడ్ కథానాయిక రష్మిక మందన్న రూ. 10 లక్షలు, నిర్మాత సూర్యదేవర నాగవంశీ రూ. 5 లక్షలు విరాళంగా ఇచ్చారు. తమిళ నటులు సూర్య, కార్తి, జ్యోతిక కలిసి రూ. 50 లక్షలు ఇవ్వగా, కమల్‌హాసన్ రూ. 25 లక్షలు, విక్రమ్ రూ. 20 లక్షలు ఇచ్చారు. దుల్కర్ సల్మాన్ రూ. 10 లక్షలు, మమ్ముట్టి రూ. 15 లక్షలు, ఫహద్‌ఫాజిల్, నజ్రియా దంపతులు రూ. 25 లక్షలు విరాళంగా అందించారు.



సక్సెస్



థియేటర్లు పెరుగుతున్నాయి

రాజ్ తరుణ్, మాల్వీ మల్హోత్రా జంటగా రూపొందిన 'తిరగబడరా సామీ' చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విజయోత్సవంలో నిర్మాత మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ 'మొత్తం 200 థియేటర్లలో విడుదల చేశాం. ఈ రోజు మరో 20 థియేటర్లు పెరిగాయి. మా సినిమాకు మంచి రిపోర్ట్ వచ్చింది. దర్శకుడు రవికుమార్ చౌదరి అద్భుతంగా తీశారు. లేడీ విలన్‌గా మన్నారా చోప్రా చక్కగా నటించింది' అన్నారు. మంచి సినిమాను ఏదీ అడ్డుకోలేదని ప్రేక్షకులు నిరూపించారని దర్శకుడు రవికుమార్ చౌదరి చెప్పారు.

ప్రేక్షక దేవుళ్లు కరుణించారు



'ఒక కొత్త హీరో నటించిన సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు. 'ప్రేక్షక దేవుళ్లు' అని ఎందుకు అంటారో నాకు ఇప్పుడు అర్థమైంది' అన్నారు 'అలనాటి రామచంద్రుడు' చిత్ర హీరో కృష్ణవంశీ. శుక్రవారం విడుదలైన ఈ చిత్రానికి మంచి ఆదరణ లభించిందని శనివారం నిర్వహించిన థాంక్స్ మీట్‌లో వెల్లడించారు. ఈ చిత్ర నిర్మాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్మాత శ్రీరామ్ జడపోలు కృతజ్ఞతలు తెలిపారు.



రెస్పాన్స్ బాగుంది

'చాలా రోజుల తర్వాత ఒక క్లీన్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను చూశామని ప్రేక్షకులు అంటుంటే ఆనందంగా ఉంది' అన్నారు దర్శకుడు విజయ్‌భాస్కర్. శ్రీకమల్, తాన్వీ ఆకాంక్ష జంటగా రూపొందిన 'ఉషా పరిణయం' చిత్రం శుక్రవారం విడుదలైంది. ఈ నేపథ్యంలో శనివారం ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో చిత్రనిర్మాత, దర్శకుడు విజయభాస్కర్ మాట్లాడుతూ 'కలెక్షన్లు నెమ్మదిగా పెరుగుతున్నాయి. రెస్పాన్స్ బాగుంది. ఇలాంటి చిన్న సినిమాలను ఆదరిస్తే మరిన్ని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్లు వస్తాయి' అన్నారు





నేడు అమరావతికి కలెక్టర్ అంబేడ్కర్

కలెక్టరేట్: రాష్ట్ర అమరావతి సచివాలయంలో ఈనెల 5,6 తేదీల్లో జరగనున్న జిల్లా కలెక్టర్ల సదస్సులో పాల్గొనేందుకు జిల్లా కలెక్టర్ డాక్టరు బీఆర్ అంబేడ్కర్ ఆదివారం అమరావతికి బయిలదేరి వెళ్లనున్నారు. ఈ సదస్సు ద్వారా రానున్న రోజుల్లో రాష్ట్ర ప్రజలకు సమర్థవంతమైన పాలన, ప్రభుత్వ కార్యక్రమాల అమలుపై సీఎం చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేస్తూ ప్రభుత్వ ప్రాధాన్యాలను వివరించనున్నారు. 6న కలెక్టర్‌లు, ఎస్పీలతో సంయుక్త సమావేశం నిర్వహించనున్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి మానుకోవాలి

విజయనగరం రూరల్: పాఠశాలల సందర్శన సమ యంలో డీఈవో, డిప్యూటీ డీఈవో, ఎంఈవో పాఠ్య ప్రణాళికలు డైరీల్లో రాయాలని ఉపాధ్యాయులను భయపెట్టడం, మానసిక ఒత్తిడికి గురి చేయడం సరికాదని ఎస్‌టీయూ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కె.జోగారావు అన్నారు. శనివారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పని సర్దుబాటు విషయంలో రాష్ట్ర డైరెక్టర్ ఇచ్చిన నిబంధనల మేరకు మండల పరిధిలోని సర్దుబాటు చేయాలన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఉపాధ్యాయుల సర్వీసు పనులు జాప్యం నివారించి సత్వరమే పరిష్కరించాలని కోరారు. సంఘ ప్రతినిధులు సూరిబాబు, గోవిందరావు, మోహనరావు, రాంబాబు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ శుభపరిణామం

రాజాం: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు పరిష్కారం లభించడం శుభపరిణామమని ఏబీవీపీ రాష్ట్ర మాజీ కార్యవర్గసభ్యులు అరుణ్‌కుమార్ స్పష్టం చేశారు. శనివారం నిర్వహించిన అంబేడ్కర్ యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికతీత పనుల పరిశీలన

రింగురోడ్డు: నగరంలోని గంటస్థంబం ప్రాంతంలోని ప్రధాన కాలువల్లో పూడికతీత పనులను నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.ఎం. నాయుడు పరిశీలించారు. కాలువల్లో పేరుకుపోయిన పూడికత తీత ప్రక్రియలో సాంకేతిక సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలను సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెలరోజులుగా అన్ని కాలువల్లో పూడికతీత పనులను ముమ్మరం చేశామన్నరు. ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు. ● ఇంటి ఆవరణ ప్రాంతాల్లో నీరు నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలని కమిషనర్ నాయుడు అన్నారు. శనివారం బొండాడ, చిన్నవీధి, ఉసిరకల సత్రం జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. వారంలో ఒకసారి డ్రైడే పాటించాలన్నారు.

కలుపు యాజమాన్య పద్ధతులు పాటించాలి

బాడంగి: వరినాట్లు తరువాత కలుపు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ సహాయకులు వాడాడ సాయికుమార్ సూచించారు. శనివారం మండలంలోని రేజేరు గ్రామంలో రైతులకు పలు సూచనలు చేశారు. వరినాట్లు వేసిన 3 రోజుల్లోపు ప్రీఎమర్జెన్సీ కలుపు నాశనిని పొలం మొత్తం సమానంగా వెదజల్లాలన్నారు. వ్యవసాయ సిబ్బంది సిఫారసు మేరకు కలుపు మందులు వినియోగించాలని, మందులు చల్లేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన వెంట పలువురు రైతులు పాల్గొన్నారు.

ఐటీఐలో చేరేందుకు మూడో విడత నోటిఫికేషన్

బొబ్బిలి: బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు మూడో విడత ఆన్‌లైన్‌లో దరఖాస్తులను కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ జీవీ రమణారావు తెలిపారు. ఎస్ఎస్‌సీ పాసైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 26 లోగా రిజిస్ట్రేషన్ చేసుకుని యూనిక్ నెంబర్ పొందాలని ఆయన సూచించారు. ఒకసారి అడ్మిషన్ పొందిన వారు అదే మొబైల్ నెంబరు నుంచి మాత్రమే స్కిల్ ఇండియా డిజిటల్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. విజయనగరం, బొబ్బిలి, రాజాం ఐటీఐలలో ఎక్కడైనా ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. ఈ నెల 29న బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో నిర్వహించబోయే కౌన్సిలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ రమణారావు తెలిపారు.

రక్తదాన ఆవశ్యకతను గుర్తించాలి

విజయనగరం క్రైం: రక్తదాన ఆవశ్యకతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని పోలీసు శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ టి.ఆనందబాబు అన్నారు. శనివారం నగరంలోని గాయిత్రీ ఆసుపత్రి, కంచెర్ల నగర పాలక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కొట్టా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆనందబాబు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు సామాజిక బాధ్యతగా రక్తదాన ఆవశ్యకతను తెలుసుకుని వేసవిలో సుమారు 320 యూనిట్లు రెడ్‌క్రాస్ సొసైటీకి అందించారన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు ప్రాణదాతగా నిలిచిన ఉపాధ్యాయుడు శ్రీనివాసరావును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. డాక్టరు జీబీ వెంకట్, ఎం రాము, ఆర్‌వి శంకరరావు, ఉపాధ్యాయులు సంతోష్‌కుమార్‌తోపాటు సుధాకర్, రెడ్‌క్రాస్ సిబ్బంది వలంటీర్లు పాల్గొన్నారు.

డ్రిప్ ఇరిగేషన్‌తో సాగునీటి ఆదా

రాజాం: డ్రిప్ ఇరిగేషన్ వినియోగం వల్ల సాగునీటి ఆదాతో పాటు భూగర్భ వనరుల పొదుపు సాధ్యమవుతుందని ఏపీఎంబీపీ పీడీ లక్ష్మీనారాయణ స్పష్టం చేశారు. మండల పరిధిలోని బొద్దాంలో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా సాగుచేస్తున్న వ్యవసాయ కమతాలను శనివారం ఆయన పరిశీలించారు. డ్రిప్ ఇరిగేషన్ సౌకర్యం అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు.

ఇళ్ల నిర్మాణాల పురోగతి పరిశీలించండి

బాడంగి: ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరి శీలించాలని హౌసింగ్ ఏఈ శ్రీనివాస్ కోరారు. శనివారం ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు ఏయే స్థాయిలో ఉన్నవి పరిశీలించాలన్నారు. నిర్మాణా లను త్వరితగతిన పూర్తిచేసేలా ఇంజనీరింగ్ అసిస్టెంట్ లు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీవో ఆంజనేయులు, ఈవోపీఆర్‌డీ సూర్యనారాయణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

కేరళ బాధితులకు విరాళాల సేకరణ

బొబ్బిలి: కేరళలోని వయనాడ్ ప్రాంతంలో సంభవించిన ఘోరవిపత్తులో నష్టపోయిన బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు సీపీఎం ఆధ్వర్యంలో శనివారం బొబ్బిలిలో విరాళాలు సేకరించారు. సీపీఎం నాయకులు శంకరరావు, గోపాలం తదితరులు ఇంటింటికీ వెళ్లి విరాళాలను సేకరించారు. సీఐటీయూ నాయకులు గౌరీశ్, వెంకట్, ఎస్ఎఫ్ఐ నాయకుడు మణికుమార్, కిరణ్, బి.లక్ష్మీదాసు తదితరులు పాల్గొన్నారు.

మోసూరు పాఠశాల తనిఖీ

బొబ్బిలి రూరల్: మోసూరువలస ప్రాథమిక పాఠశాలను ఎంపీడీవో రవికుమార్ శనివారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఆయన వెంట ఈఓపీఆర్‌డీ భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి కలాం తదితరులు పాల్గొన్నారు.

మరణించిన పోలీసు కుటుంబాలకు చేయూత

● ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, ఆగస్టు 3: జిల్లా పోలీసుశాఖలో విధులు నిర్వహించి ఇటీవల కాలంలో మరణించిన కానిస్టేబుల్స్, హోంగార్డుల కుటుంబాలకు చేయూతను అందించేందుకు సిబ్బంది సేకరించిన ఒక్క రోజు అలెవెన్సును కుటుంబ సభ్యులకు ఎస్పీ వకుల్ జిందాల్ శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. హోంగార్డులుగా పనిచేస్తూ వెంకట సత్యం కుటుంబానికి 3 లక్షల 26 వేల 600 రూపాయల చెక్కును ఆయన సతీమణి పార్వతికి అందజేశారు. అలాగే, కానిస్టేబుల్‌గా పనిచేస్తూ, అనారోగ్య కారణాలతో మరణించిన టీ గౌరీకుమార్ కుటుంబానికి చేయూతగా పోలీసు ఉద్యోగులు సేకరించిన లక్షా 48 వేల 900 రూపాయల చెక్కును ఆయన సతీమణి ఇందిరా వసంతకి అందజేశారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం హోంగార్డు ఉద్యోగుల పిల్లలకు మంజూరు చేసిన మెరిట్ స్కాలర్‌షిప్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ, పోలీసుశాఖలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు ఆకస్మికంగా లేదా అనారోగ్యంతో మరణించిన పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం నుంచి బెనిఫిట్స్ అందేంత వరకూ వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునేందుకు సిబ్బంది ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సూపరిడెంట్ంట్ ప్రభా కరరావు, ఆర్‌ఐ రమేష్‌కుమార్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

'పట్టాలు ఇచ్చి స్థలం అప్పజెప్పలేదు'



రేగిడి తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

రేగిడి: రేగిడి గ్రామానికి చెందిన 18 ఎస్టీ కుటుంబాలకు ఉంగరాడమెట్ట వద్ద హౌస్‌సైట్‌లకు పట్టాలు జారీ చేసి స్థలం అప్పజెప్పకపోవటంపై రేగిడి గ్రామానికి చెందిన నందివాడ గంగన్నదొర, మిగితా ఎస్టీ కుటుంబాలకు చెందిన వ్యక్తులు శనివారం తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తంచేశారు. 2008లో అప్పటి ప్రభుత్వం తమకు గుళ్లపాడు బౌండరీలో సెంటుస్థలం కేటాయించిందని, ఏళ్లు గడుస్తున్నా స్థలం అప్పజెప్పలేదని, దీనిపై రెవెన్యూ అధికార్ల చుట్టూ తిరుగుతున్నా తమకు న్యాయం జరగటం లేదని వాపోయారు. దీనిపై తహసీల్దార్ ఎల్లరావుకు వీరింతా మోమెరాండం సమర్పించారు. దీనిపై ఆర్ఐ విచారణకు పంపించి న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇవ్వటంతో వీరు వెనతిరుగారు. ఈ నిరసనలో ఎస్టీ కుటుంబాలకు చెందిన బి రామన్నదొర, సాయి, బి అప్పమ్మ, గౌరి పాల్గొనగా, వీరికి జనసైనికులు లావేటి గౌతం, రేగిడి యువత మద్దతు తెలిపారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి

రాజాం రూరల్, ఆగస్టు 3: మత్తు మనిషిని చిత్తు చేస్తుందని, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండడం ద్వారా ప్రశాంతమైన జీవితాన్ని గడపవచ్చని మండల న్యాయ సేవాధి కార సంస్థ అధ్యక్షుడు, సీనియర్ న్యాయాధికారి వివేక్ ఆనంద్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. మాదకద్ర వ్యాల దుర్వినియోగం, నిర్మూలన, వికలాంగులకు చట్టపరమైన సేవలు, తదితర అంశాలను వివరించారు. జూనియర్ న్యాయాధికారి కృష్ణ సాయితేజ మాట్లాడుతూ పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేకశ్రద్ధ కనబరచాలని సూచించారు. వారి ప్రవర్తన నడవడికపై దృష్టిని కేంద్రీకరించాలని హితవు పలికారు. మానసిక రుగ్మతలు-చికిత్సా విధానం పై డా.ఆదర్శ్ వివరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు రామినాయుడు, సెబ్ ఎస్.ఐ. చంద్రశేఖర్ రావు, సంతకవిటి ఎస్.ఐ. షేక్ శంకర్, కొత్తా సాయి ప్రశాంత్ కుమార్, పెంకి చైతన్యకుమార్ పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రింగురోడ్డు: ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామానారా యణం ప్రాంగణంలో శనివారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించు కుని, దేవాలయ అర్చ కులు చాణక్య శ్రీ హర్ష, తేజ ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ సీతారాములకు పంచామృతాభిషేకాలు పూజలు నిర్వహించారు. అనంతరం కన్నుల పండవగా సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఈ ఉత్సవంలో ఎన్.సీ.ఎస్ నారాయణం శ్రీనివాస్, నీరజవల్లి దంపతులు భక్తులు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ చేసిన బేబీనాయన



విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్నబేబీనాయన

బాడంగి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఎమ్మెల్యే బేబీనాయన శనివారం పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బేబీనాయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖా మంత్రి నారా లోకేష్ విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. దీనిలో భాగంగా ఇంటర్ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేపట్టారన్నారు. అనంతరం జీఎంసీ బాలయోగి గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే సందర్శించారు. ప్రిన్సిపాల్ రామదాసుతో పాఠశాలలో గల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గురుకుల పాఠశాల ఆవరణలో పండ్లు, పూల మొక్కలను నాటారు. మండల పార్టీ అధ్య క్షుడు తెంటు రవిబాబు, సర్పంచ్ కండి రమేష్, ఎంపీటీసీ దేవరపల్లి శ్రీనివాస రావు, జడ్పీటీసీ రామారావు, రాష్ట్ర ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ పాలవలస గౌరి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ పోటీలు ప్రారంభం

విజయనగరం టౌన్: విజయనగరం చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర అండర్-7 ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. విజయనగరం జిల్లా కేంద్రంలోని గురజాడ పాఠశాలలో డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు పోటీలను ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ట్రోఫీలు అందజేయడం జరుగుతుందని చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ భీమారావు, ట్రెజరర్ కెఎల్ జ్వాలాముఖి రాష్ట్ర ఉపాధ్యక్షులు పి మస్తాన్‌బాబులు తెలిపారు. కార్యక్రమంలో గురజాడ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బూడి శేఖర్, చెస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాలో కొత్తగా 39 లెప్రసీ కేసులు

విజయనగరం రింగురోడ్డు: జిల్లాలో కొత్తగా 39 లెప్రసీ (కుష్టు) వ్యాధి కేసులు నమోదైనట్లు డీఎంహెచ్‌వో భాస్కరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 18 నుంచి 15 రోజుల పాటు ఇంటింటా కుష్టువ్యాధిపై సర్వే కార్యక్రమాన్ని నిర్వహించగా వీరిలో అనుమానాస్పద కేసులుగా 2,519 మందిని గుర్తించామన్నారు. మిగిలిన వారికి కూడా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఎవరైనా స్పర్శలేని మచ్చలు, కాళ్లు లేదా చేతులు కండరాల బలహీనతల లక్షణాలు కన్పిస్తే, ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు.

● కుష్టువ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని చెల్లూరు లెప్రసీ మిషన్, హీల్ ప్రాజెక్టు ప్రతినిధి డాక్టరు తాలాడ దీప్తి అన్నారు. ప్రభుత్వం చేపట్టిన కుష్టువ్యాధి ఇంటింటి సర్వే ముగింపు కార్యక్రమంలో భాగంగా చెల్లూరులోని ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు కుష్టువ్యాధిపై అవగాహన కల్పించారు.

వీణల తయారీ కళాకారులకు వర్క్‌షాప్

బొబ్బిలి, ఆగస్టు 3: స్థానిక గొల్లపల్లి వీణల తయారీ కేంద్రంలో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వీణల తయారీ కళాకారులకు డిజైన్ అండ్ టెక్నికల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాపును శనివారం ప్రారంభించారు. బొబ్బిలి, వాడాడ గ్రామాలకు చెందిన 20 మంది వీణల తయారీదారులకు నైపుణ్యాలను పెంచుకునేందుకు అక్టోబరు 1 వరకు ఈ వర్క్ షాపు నిర్వహిస్తారు. విశాఖకు చెందిన లేపాక్షి కార్యనిర్వహణాధికారి ఆనపు కార్తీక్ ఈ వర్క్‌షాపును ప్రారంభించారు.

కోరుకొండ సైనిక స్కూల్‌లో ఇన్వెస్టిచర్ కార్యక్రమం

విజయనగరం రూరల్: కోరుకొండ సైనిక స్కూల్‌లోని డాక్టరు పీవీజీ రాజు ఆడిటోరియంలో శనివారం ఇన్వెస్టిచర్ వేడుక వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా క్యాడెట్‌లకు ర్యాంకులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆ స్కూల్ ప్రిన్సిపాల్ గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి మాట్లాడుతూ స్కూల్ క్రమశిక్షణ, విలువలను నిలబెట్టేందుకు ప్రతి క్యాడెట్ అంకితభావంతో కృషి చేయాలన్నారు. అనంతరం ప్రతిష్ఠాత్మకమైన స్కూల్ వార్షిక ట్రోఫీలను అందజేశారు. గజపతి హౌస్ చాంపియన్ ఆఫ్ చాంపియన్ హౌస్, అకడమిక్, డిసిప్లేన్ ట్రోఫీలను అందుకుంది.

సుప్రీం కోర్టు తీర్పు నిలిపివేయాలి

శృంగవరపుకోట రూరల్: ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పు నిలిపివేయాలని జిల్లా దళిత సంఘ నాయకులు తెరపల్లి కోటరావు, గుర్రపు శ్రీనువాసరావు కోరారు. శనివారం కొట్టాం గ్రామంలో అంబేద్కర్ విగ్రహం వద్ద వీరు మాట్లాడారు. ఈ తీర్పుతో తమ ఐక్యత దెబ్బ తింటుందన్నారు.

మధ్యాహ్న భోజన బియ్యం పరిశీలన

శృంగవరపుకోట రూరల్: సంతగెరమ్మపేట ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి వినియోగించే బియ్యాన్ని పౌర సరఫరాల డీటీ శ్రీనువాసరావు శనివారం పరిశీలించారు. భోజనంలో నాణ్యత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బంగారునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

కొత్తవలస: కొత్తవలస-విజయనగరం రోడ్డులోనున్న శ్రీనివాస ఫంక్షన్ హాలులో సుబ్బలక్ష్మీ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ట్రస్టు చైర్మన్ కనకాల శివ తెలిపారు. 18 నుంచి 60 ఏళ్ల లోపు వారు ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు.

కేజీబీవీకి డిజిటల్ లైబ్రరీ వితరణ

లక్కవరపుకోట: మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల గురుకుల పాఠశాలకు సాహసం స్వచ్ఛంద సంస్థ రూ.1.5లక్షల విలువైన డిజిటల్ లైబ్రరీని శనివారం అందించింది. సంస్థ అధినేత మాచవరపు గణేష్, వేంకటేశ్వర ఇన్‌ఫ్రా అండ్ ప్రాజెక్టు డైరెక్టర్ ఈశ్వరరావు, శ్రీదేవి, ప్రిన్సిపాల్ బి.ప్రవీణ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో సదస్సులు

బొబ్బిలి రూరల్: ఎరకందొరవలస, మోసూరువలస, డొంగురువలస గ్రామాల్లో శనివారం న్యాయ అవగాహన సదస్సులు, వైద్యశిబిరాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో పాల్గొన్న ఎంపీడీవో రవికుమార్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదమున్నందున అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పిరిడి పీహెచ్‌సీ డాక్టర్ భరద్వాజ ఆధ్వర్యంలో ప్రజలకు సేవలందించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచితంగా పుస్తకాల పంపిణీ

బొబ్బిలి రూరల్: ఎం.పనుకువలస మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఉపాధ్యాయ సంఘం నేత కె.విజయగౌరి శనివారం ఉచితంగా పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు

లక్కవరపుకోట: తామరాపల్లి రెవెన్యూలో సర్వే నెంబరు 3,11,12,13లలో గల గెడ్డను ఆక్రమించి సాగుకు ప్రయత్నాలు చేస్తున్న భూముల్లో హెచ్చరిక బోర్డులు పాతారు. శనివారం రెవెన్యూ సిబ్బందిని పంపించి సంబంధిత భూముల్లో బోర్డులు పాతామని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. గెడ్డను ఆక్రమించిన వారిపై విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైతులకు అవగాహన



ఎలా ఉడుపుచేయాలో వివరిస్తున్న ఏవో రవీంద్ర

శృంగవరపుకోట రూరల్: వరి రైతులు నారు చివర్లు తుంచి నాటడం వల్ల కలిగే ప్రయోజనాలను మండల వ్యవసాయాధికారి రవీంద్ర వివరించారు. శనివారం వసి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమం లో ఎలా నాటాలో చూపించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వీఏఏలు రవి, వివేక్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహమే శాశ్వతం..



విజయనగరం (ఆంధ్రజ్యోతి)

ఆ ముగ్గురి స్నేహం ఈ నాటిది కాదు. ప్రాంతాలు, కులాలు, మతాలు వేరైనా వారి అనుబంధం మరింత బలపడింది. స్నేహం శాశ్వతం అన్న నానుడిని వారు నిజం చేస్తున్నారు. వారిలో ఒకరు శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలం వీఎన్ పురానికి చెందిన హిందువు, ప్రస్తుతం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కాగా రాయలసీమ ప్రాంతం కదిరి సమీపంలోని గార్లపెంట గ్రామానికి చెందిన ముస్లిం మతస్థుడు సుభాన్ ఒకరు, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం సమీపంలోని పెడనకు చెందిన క్రిస్టియన్ తరపట్ల శ్యామ్ ప్రసాద్ మరొకరు. ఈ ముగ్గురికీ 1994లో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి ఇప్పటి వరకూ మూడు దశాబ్దాలుగా అదే ఆత్మీయతతో ఉన్నారు. ప్రతిష్ఠాత్మకమైన అయోధ్య రామమందిర నిర్మాణానికి ఈ ముగ్గురు స్నేహితులూ కలిసి గత ఏడాది బ్యాంకు డీడీల ద్వారా ఆర్థిక సాయం పంపించారు. అలాగే ఉమ్మడిగా పలు ఉచిత వైద్యశిబిరాలు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్నేహి తుల దినోత్సవం రోజు అయిన ఈ నెల 4న ఈ ముగ్గురు ప్రత్యేకంగా కలిసేందుకు నిర్ణయించుకున్నారు.

తల్లిపాలు శ్రేష్టమైనవి

తెర్లాం, ఆగస్టు 3: పెరుమాళి సెక్టారులో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పెరుమాళి, జగన్నాథవలస, కాలంరాజుపేట గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్లలో తల్లిపాల వారోత్సవ ర్యాలీలు నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ చిట్టమ్మ మాట్లాడుతూ తల్లిపాలల్లో విటమిన్లు, ప్రోటీన్లు సమపాలలో ఉండడం వల్ల బిడ్డ శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందుతారని అన్నారు. బిడ్డకు ఆరు నెలలపాటు ప్రతీరోజూ 12సార్లు తల్లిపాలు తాగించాలని, దీనివల్ల జ్ఞాపకశక్తి, చురుకుదనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అంగ్‌వాడీ సిబ్బంది ఎన్.లక్ష్మి, విజయభారతి, రత్నకుమారి, దమయంతి, సునీత, బాలింతలు పాల్గొన్నారు.

బొబ్బిలి: బొబ్బిలి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మల్లమ్మపేట, చెరువుగట్టువీధి, చింతాడ, నారసింహునిపేట, గున్నతోటవలస గ్రామాల అంగన్వాడీ కేంద్రాలలో శనివారం తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. సీడీపీఓ జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణీలకు ఘనంగా శ్రీమంతాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సూపర్‌వైజర్లు సీహెచ్ అరుణకుమారి, కృష్ణవేణి, వై.రాజు, ఎన్.ప్రభావతి, ఎం.శుభలక్ష్మి పాల్గొన్నారు.

శృంగవరపుకోట రూరల్ /జామి ఆగస్టు 3 : శృంగవరపుకోట మండలం వెంకటరమణపేట, జామి మండలం అలమండలో శనివారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. వెంకటరమణపేట గ్రామంలో నిర్వహించిన ఈ వారోత్సవంలో సూపర్‌వైజర్ సుశీల మట్లాడుతూ తల్లిపాలపై వున్న అపోహాలు వీడనాడాలనీ సూచించారు.

కొత్తవలస : వియ్యంపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం సీతంపేట, అప్పన్నపాలెం, ఉత్తరాపల్లి గొల్లలపాలెం, దేవాడ గ్రామాలలో తల్లిపాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాలు విశిష్ట గురించి తెలిపారు.

విజయనగరం రూరల్: పుట్టిన బిడ్డకు తొలి టీకా ముర్రిపాలేనని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనురాధ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఐసీడీఎస్ పరిధిలోని బొత్సపేట రెండో అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రిపాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఎం కృష్ణవేణి, అంగన్‌వాడీ కార్యకర్త శ్యామలాదేవి, ఆశావర్కర్ విజయలక్ష్మితో పాటు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.



బొబ్బిలి: మల్లమ్మపేటలో గర్భిణులకు సీమంతం

చికిత్స పొందుతున్న విద్యార్థులు క్షేమం



కేజీహెచ్‌లో వైద్యం పొందుతున్న నవ్య వద్ద వైద్యాధికారి శిరీష

శృంగవరపుకోట రూరల్, ఆగస్టు 3: మండలంలోని గిరిశిఖర గ్రామం చిట్టంపాడుకు చెందిన 23 మంది విద్యార్థులు డయేరియా బారిన పడి చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. అయితే వీరిలో ఇద్దరు విద్యార్థినులు సన్యాసమ్మ, నవ్య పరిస్థితి విషమించడంతో వారిని విశాఖ కేజీహెచ్‌కు మూడురోజుల క్రితం తరలించారు. అయితే అక్కడ పిల్లల ఆరోగ్య పరిస్థితి సమీక్షిస్తున్న డాక్టర్ శిరిష మాట్లాడుతూ ఇద్దరు పిల్లల పరిస్థితి మెరుగుపడిందన్నారు. వీరిలో నవ్యకు డయాలసిస్ జరిగిన తరువాత ఆరోగ్యం కుదుటపడిందని, డయేరియా బారిన పడ్డ మొత్తం విద్యార్థుల ఆరోగ్యం బాగుందని తెలిపారు.

నవదుర్గ ఆలయ ఈవోపై విచారణ



రికార్డులను పరిశీలిస్తున్న ఉప కమిషనర్

రాజాం రూరల్, ఆగస్టు 3: రాజాంలోని నవదుర్గ అమ్మవారి దేవస్థానం, వంగర మండలం సంగమేశ్వర ఆలయాల ఈవో కేశవరావు పనితీరు, వ్యవహార శైలిపై దేవదాయ శాఖ ఉన్నతాధికారులు శనివారం దర్యాప్తు నిర్వహించారు. దేవదాయశాఖ ఉప కమిషనర్ సుజాత, జిల్లా సహాయ కమిషనర్ అన్నపూర్ణ ఆధ్వర్యంలో రాజాంలోని ఆలయంలో సమావేశమయ్యారు. రెండు ఆలయాలకు సంబంధించిన ఖర్చుల వివరాలతో పాటు అర్చకులు, సిబ్బందికి కొన్ని నెలలుగా వేతనాల అందజేతలో చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలపై దర్యాప్తు చేపట్టారు. నవదుర్గ అమ్మవారి దేవస్థానం చైర్మన్ నరిశింగరావుతో పాటు సిబ్బంది నుంచి వివరాలను సేకరించారు. జీతాల చెల్లింపులో జాప్యంతో పాటు అవకతవకలున్నట్లు అధికారులు గుర్తించారు. దీనిపై దేవదాయశాఖ కమిషనర్‌కు నివేదిస్తామని సుజాత స్పష్టం చేశారు. ఈవో కేశవరావు శైలిపై ఉన్నతాధికారులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పని తీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

ఎస్.కోట బీసీ కళాశాల బాలుర వసతిగృహం తనిఖీ



వసతి గృహ విద్యార్థులతో మాట్లాడుతున్న సందీప్

శృంగవరపుకోట, ఆగస్టు 3: శృంగవరపుకోట బీసీ కళాశాల బాలుర వసతి గృహాన్ని శనివారం సాయంత్రం జిల్లా సంక్షేమ అధికారి కె.సందీప్ తనిఖీ చేశారు. వంట గదులను, రికార్డులను పరిశీలించారు. భోజనం రుచి చూసారు. విద్యార్థులతోను సమావేశమయ్యారు. వసతి గృహ సంక్షేమ అధికారి సత్యనారాయణ వున్నారు.

వాడీవేడిగా రేగిడి మండల సమావేశం



బూరాడ పీహెచ్‌సీ సిబ్బందిని నిలదీస్తున్న దృశ్యం

రేగిడి: రేగిడి మండల సర్వసభ్య సమావేశం శనివారం వాడీవేడిగా సాగింది. గ్రామ స్థాయి సమస్యలు, ప్రొటోకాల్ ఉల్లంఘన, అధికారుల తప్పిదాలపై అభియోగాలు తీవ్ర చర్చకు దారితీశాయి. ప్రతిపక్ష వైసీపీ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులను అన్నింటా విస్మరిస్తున్నారంటూ అధికార యంత్రాంగాన్ని గట్టిగా నిలదీశారు. సభ్యులు కాని వారు ప్రశ్నలు సంధించి ఈచర్చకు మరింత ఆజ్యం పోశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ దార అప్పలనరసమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఎమ్మెల్సీ విక్రాంత్ స్పందిస్తూ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తే ఊరుకోబోమని, తమ పార్టీ సభ్యులను అగౌరవపరిస్తే ఎంతవరకైనా వెళ్తామని హెచ్చరించారు. విద్య, వైద్యం, వెలుగు, వ్యవసాయం, పంచాయితీరాజ్‌పై వాడీవేడిగా చర్చ జరిగింది. తాటిపాడు, అంబఖండి పాఠశాలల్లో మిడ్‌డేమీల్, స్వచ్ఛదూత్ సిబ్బంది తొలగింపు, వెలుగులో వీఓఏల కార్యవర్గ నియామకంపై సర్పంచ్‌లకు సమాచారం లేకపోవటం చర్చకు దారి తీసింది. బూరాడ రైతుభరోసా ప్రారంభోత్సవానికి కొర్లవలస సర్పంచ్‌కు సమాచారం ఇవ్వకపోవడంపై వైస్ ఎంపీపీలు టి.అచ్చంనాయడు, వి.జగన్మోహనరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వారి ప్రతినిధులు స్పందిస్తూ ఇందుకు బాధ్యులైన ఎంఈవో వరప్రసాదరావు, ఏపీఎం గోవిందరావు, ఏవో మురళీకృష్ణలను గట్టిగా నిలదీశారు. పాఠశాలల్లో సిబ్బంది తొలగింపుపై ఎంఈవో సరైన సమాధానం ఇవ్వకపోవడంపై విచారణ కోరుతూ కలెక్టర్‌కు నివేదించాలని తీర్మానం చేశారు. బూరాడ పీహెచ్‌సీ పనితీరు, ఉపాధి శాఖలో కొంత మంది టీఏల పనితీరును సభ్యులు తప్పుపట్టారు. బూరాడ పీహెచ్‌సీ డాక్టర్ చలమయ్య పనితీరు అసలు బాగోలేదని వైస్ ఎంపీపీ వి.జగన్మోహనరావు, కొంతమంది సర్పంచ్‌లు సభలో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మండల సమావేశంలో సభ్యులకు బదులు వారి భర్తలు, కుటుంబ సభ్యులు హాజరయ్యారు. పంచాయతీరాజ్, వెలుగు, విద్యాశాఖపై జరిగిన చర్చలో జీవోల ప్రాప్తికి అడిగి ఆ శాఖ అధికారులను వీరు ఉక్కిరిబిక్కిరి చేశారు. దీనిపై అధికారులు నీళ్లు నమిలారు.

ఏటీఎల్ మారథాన్ పోటీల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

కలెక్టరేట్: అటల్ టింకరింగ్ ల్యాబ్(ఏటీఎల్) మారథాన్(2023-24) దేశ వ్యాప్తంగా జరిగిన పోటీల్లో జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపించారు. ఆల్ ఇండియా టాప్ 500 ప్రాజెక్టులలో ఏపీకి చెందిన 35 ప్రాజెక్టులు ఎంపిక కాగ, జిల్లా నుంచి ఐదు ప్రాజెక్టులు ఎంపికైనట్లు డీఈవో ప్రేమకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తవలస మోడల్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు భాను సాయి, జతిన్ తయారు చేసిన ప్రాజెక్టు, పట్టణంలోని పోర్టు సిటి స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు ఎం.నిఖిల్, డి. కార్తికేయ, ఎం.ప్రణయ్ కౌశిక్‌ల ప్రాజెక్టు, భోగాపురం మోడల్ స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థులు జి.వర్షిత, యశస్విని, అక్షయల ప్రాజెక్టు, రామభద్రపురం జిల్లా పరిషత్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి కె.గౌతం, 9వ తరగతి విద్యార్థి బి.శ్యాం సాయిల ప్రాజెక్టు, దెందేరు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన పది తరగతి విద్యార్థులు జె.పూజ, గోపి, బాలు నర్సింహులు తయారు చేసిన ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. విద్యార్థులను డీఈవో ప్రేమకుమార్ అభినందించారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

రాజాం రూరల్: పట్టణంలోని తెలగవీధికి చెందిన బావరాజు వెంకటేష్ తనను కర్ర, రాయితో కొట్టి గాయపరిచాడని అదేవీధికి చెందిన శెట్టి శ్రీనివాసరావు శనివారం రాజాం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈనెల 2న రాత్రి తాను పని ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో తనపై పాత కక్షతో దాడిచేసినట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు. శ్రీనివాసరావు రాజాం సామాజిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్.ఐ. రవికిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలలో మొక్కల పెంపకం

బొబ్బిలిరూరల్: అలజంగి ప్రాథమిక పాఠశాలలో శనివారం కె.కృష్ణదాసు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. హెచ్ఎం మోజెస్, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మో.. అడుగడుగునా గోతులు

●తరచూ ప్రమాదాలు ● ఇదీ పార్వతీపురం- పాలకొండ రోడ్డులో దుస్థితి

గరుగుబిల్లి: పార్వతీపురంనుంచి పాలకొండ వైపు వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. అడుగడుగునా గోతులమయంకావడంతో వాహనచోదకులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు.ఈ మార్గంలో నిత్యంఏదో ఒకచోట ప్రమాదం జరుగుతోంది. ఉల్లిభద్ర ప్రాంతంలో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఉల్లిభద్ర నుంచి సంతోషపురం, ఖడ్గవలస, సుంకి, కేఆర్ఎన్ వలస, తదితర గ్రామాలకు ఆనుకుని ఉన్న రహదారి మార్గం ప్రమాదభరితంగా తయారైంది. ఖడ్గవలస సముదాయంలో ఇరువైపులా గోతులు ఏర్పడడంతో వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు.ఈమార్గంలో చీకటిపడిన తర్వాత ప్రయాణం చేసేందుకు చోదకులు భయపడుతున్నారు. బొబ్బిలి సమీపంలోని పారాది వంతెన బలహీనంగా ఉండడంతో ఈమార్గం గుండా భారీ వాహనాలు అధిక సంఖ్యలో వస్తున్నాయి. దీంతో రోడ్డు మరింత అధ్వానంగా మారుతోంది. రహదారిపై ఏర్పడిన గోతులనుతాత్కాలికంగానైనా పూడ్చివేయాలని పలువురు కోరుతున్నారు.



ఖడ్గవలస ప్రధాన రహదారిపై ఏర్పడిన భారీ గొయ్యి

గ్రేడ్-5 కార్యదర్శులకు డీడీవో అధికారం

కొమరాడ: గ్రామ పంచాయతీల్లో గ్రేడ్-5 హోదా గల కార్యదర్శులకు ఇకపై డీడీవో అధికారాలు లభించనున్నాయి. వీరు పంచాయతీ సిబ్బంది వేతనాలు, బిల్లులు, ఇతర నిధులు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం వీలు కల్పించింది. పార్వతీపురం మన్యం జిల్లాలో 197 మంది గ్రేడ్-5 కార్యదర్శులు డీడీవో అధికారాలు పొందనున్నారు. ఈ విషయమై జిల్లా పంచాయతీ అధికారి సత్యనారాయణ వద్ద ప్రస్తావించగా గ్రేడ్-5 కార్యదర్శులకు డీడీవో అధికారాలను ప్రభుత్వం కల్పించిందని స్పష్టం చేశారు.

ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు సస్పెన్షన్

పాచిపెంట/సాలూరు:పాచిపెంట మండలంలోని కేసలి పంచాయతీకి చెందిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు పింఛన్ల పంపిణీలో అవినీతికి పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఉత్తర్వుల మేరకు సస్పెండ్‌చేసినట్లు ఎంపీడీవో పి.లక్ష్మీకాంత్ తెలిపారు. కేసలి పంచాయతీ కార్యదర్శి శనాపతి సునీత, మోదుగ పంచాయతీ కార్యదర్శి కోలక వాసులను శుక్రవారం సస్పెండ్ చేశారు. గుంటూరు జిల్లాకు చెందిన నిమ్మగెడ్డ గంగాధరరావు పేరుతో పింఛన్ కొద్దినెలలుగా చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. నిమ్మగెడ్డ గంగాధరరావు మృతిచెంది ఏడాది కావస్తోందని విచారణలో తేలినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో కేసలి గ్రామ సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉండడంతో మెదుగ పంచాయతీకి చెందిన గ్రేడ్-5 కార్యదర్శి కోలక వాసును వెల్ఫేర్ అసిస్టెంట్ (ఇన్‌చార్జి)గా నియమించారు. పింఛన్లు సక్రమంగా పంపిణీ చేయాల్సిన బాధ్యత ఉందని ఆయన్ను కూడా బాధ్యుడిని చేస్తూ సస్పెండ్ చేశారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ



గుమ్మలక్ష్మీపురం: విరాళాలు సేకరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం,ఎల్విన్‌పేటలో కేరళ వరద బాధితుల సహాయం నిమిత్తం ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కూరంగి గోపీనాథ్ మాట్లాడుతూ కేరళలో వచ్చిన వరదల వల్ల వేలాది మంది నిలువునీడ లేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, వారి అండగా నిలిచేందుకు విరాళాల సేకరణ కార్య క్రమానికి శ్రీకారం చుట్టామని తెలిపారు.

● **పార్వతీపురం టౌన్:** కేరళ వరద బాధితులకు అండగా ఉండాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.వేణు కోరారు. కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనలో 300 మందికి పైగా మృత్యువాత పడడం తెలిసిందే. ఈ సందర్భంగా బాధితులను ఆర్థికంగా ఆదుకోవాలని, ఆ పార్టీ పిలుపు మేరకు శనివారం ప్రధాన రహదారిలో ప్రజల నుంచి రూ.8,800 సేకరించినట్లు ఆయన తెలిపారు.

● **సాలూరు:** వాయినాడ్‌ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని సీపీఎం జిల్లా నాయకులు ఎన్‌వై నాయుడు డిమాండ్ చేశారు. పట్టణంలో శనివారం సీపీఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

●గరుగుబిల్లి ఎంపీడీవో సూర్యనారాయణ



మాట్లాడుతున్న సూర్యనారాయణ

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో పి.సూర్యనారాయణ, ఈవోపీ ఆర్డీ ఎల్.గోపాలరావులు సూచించారు. శనివారం స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న దృష్ట్యా వ్యాధులబారిన పడకుండా ఉండేలా అవగాహన కల్పించాలన్నారు. పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మురుగు నిల్వలతో పాటు రహదారులను శుభ్రపర్చాలన్నారు. దోమలు విజృంభించకుండా ఉండేలా ఫాగింగ్ నిర్వహించాలన్నారు. ఇంటింటా జ్వరాలపై సర్వే నిర్వహించి వైద్యాధికారులకు నివేదికలు అందించాలన్నారు. పింఛన్లతో పాటు ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందేలా దృష్టి సారించాలన్నారు. సమావేశంలో కార్యదర్శులు టి.భాస్కరరావు, ఆర్.శశిభూషణరావు, సీహెచ్‌వీ కూర్మినాయుడు, అప్పారావు, శ్రీనివాసరావు, భార్గవనాయుడు పాల్గొన్నారు.

రైతులకు సహకరిస్తాం: ఇన్‌చార్జి పీడీ

పార్వతీపురం రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో కాయగూరలు సాగుచేస్తూ జీవనం సాగి స్తున్న రైతులకు ప్రభుత్వం నిబంధన ప్రకారం తమ పరిధిలోని సహకారాన్ని పూర్తిస్థాయిలో అందిస్తామని ఇన్‌చార్జి డీఆర్‌డీఏ పీడీ సత్యంనాయుడు తెలిపారు. నర్సిపురం తదితర పంచాయతీల పరిధిలో కాయగూరలు సాగును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ దళారులను నమ్మవద్దని కాయగూరలు బాగా పండించి విక్రయించుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు.

1,014 లీటర్ల సారా ధ్వంసం

సీతంపేట:సీతంపేట పోలీస్‌స్టేషన్‌ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో పట్టుబడిన 1014 లీటర్ల సారాను డీఎస్పీ జీవీ కృష్ణారావు ఆధ్వర్యంలో శనివారం ధ్వంసం చేశారు. కార్య క్రమంలో సీతంపేట పోలీస్‌స్టేషన్ ఎస్ఐ జగదీష్‌నాయుడు, ఏఎస్ఐ సంజీవ్, వీఆర్వో సుబ్బారావు పాల్గొన్నారు.

ఎత్తిపోతల నుంచి చిమ్ముతున్న నీరు



లీకవున్న ఎత్తిపోతల పథకం పైపులు

సాలూరు రూరల్: మామిడిపల్లి సమీపాన ఉన్న బురదాలమ్మ ఎత్తిపోతల పథకం పైపులు లీకులు ఏర్పడి నీరు వృథాగా పోతోంది. సాగుకు అవసరమైన నీరు పైపుల లీకేజీ వల్ల వృథా అవుతోంది. సువర్ణముఖీ నదిపై 430 ఎకరాలకు సాగునీరు లక్ష్యంగా ఈ ఎత్తిపోతల పథకం నిర్మించారు. లీకేజీలను అరికట్టాలని సంబంధిత అధికారులను కోరుతున్నా స్పందించడం లేదని రైతులు చెబుతున్నారు. ఈ లీకేజీలను అరికట్టి సాగునీరు వృథాను నిలువరించాలని వారు కోరుతున్నారు.

హామీలు అమలు చేస్తాం

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్‌మోహన్ సామల్



మాట్లాడుతున్న మన్‌మోహన్ సామల్

ఒడిశా

రాయగడ:ఎన్నికల ముందు రాష్ట్రప్రజలకు ఇచ్చిన అన్నిహామీలను అమలుచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్‌మోహన్ సామల్ తెలిపారు. శనివారం రాయగడ బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న సహజవనరులను సద్వినియోగం చేసుకుని అన్నిరంగాల్లో నెంబర్ వన్‌గా నిలబెడతామన్నారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో మారు మూల గ్రామాలకు విద్య, వైద్యం, రహదారులు వంటి అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన హామీ మేరకు త్వరలో వారి ఖాతాల్లో రూ 50 వేలు జమచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాశీరాం మాఝి, రాయగడ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల పరిశీలన



తనిఖీలు నిర్వహిస్తున్న కల్యాణి సంఘమిత్ర దేవి

రాయగడ: రాయగడ సమితిలోని కెరడ, అట్టాడ, పితామహల్ లడార్‌సింగ్ గ్రామాల్లో ఆశ్రమ పాఠశాలలను సబ్‌కలెక్టర్, ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ కల్యాణి సంఘమిత్ర దేవి,అసిస్టెంట్ వెల్ఫేర్ అధికారులు ప్రశాంత్‌కుమార్ బౌరి, సమీంద్ర సాహులు పరిశీలించారు. అనంతరం కోట్లగుడ అన్వేషి హాస్టల్‌లో విద్యార్థులతో కలిసి భోజనంచేసి నాణ్యతను పరీక్షించారు.

సమాచారం లేకుండా వస్తారా..?

● అధికారులపై ఎమ్మెల్యే విజయచంద్ర ఆగ్రహం



అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

సీతానగరం: ఉపాధిహామీ, పంచాయతీరాజ్ శాఖల సిబ్బందిపై పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. సమావేశానికి సమగ్ర సమాచారం లేకుండా వస్తారా అని ప్రశ్నించారు. దీంతోపాటు సర్వసభ్య సమావేశం బ్యానర్ పెట్టపోవడంతో సరదా సమావేశమా, సర్వసభ్య సమావేశమా అని నిలదీశారు.శనివారం బలిజిపేట మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ నాగమణి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజ్జాడ, పదమాయవలస, చాకరాపల్లి మధ్యలో నది ఉండడంతో తమ గ్రామాలకు ఎరువులు పంపిణీ, ప్రభుత్వ పనులు సకాలంలో చేపట్టలేని పరిస్థితి ఏర్పడుతోందని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ జీవీ జనార్దన్, మండల అధికారులు, జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

●**పార్వతీపురంరూరల్:** తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు ఆశ వర్కర్ల సంఘం ప్రతినిధి శివానీ, సీఐటీయూ నాయకులు జి.వెంకటరమణ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందించారు. సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.



భామిని: సొలికిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు



సీతంపేట రూరల్: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

● ఐసీడీఎస్ సీడీపీవో రంగలక్ష్మి

సీతంపేట రూరల్ : తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని ఐసీడీఎస్ సీడీపీవో టి.రంగలక్ష్మి తెలిపారు.శనివారం స్థానిక సెక్టార్ -1 కేంద్రంలో తల్లిపాలవారోత్సవాలు నిర్వహించారు.ఈ సందర్భంగా వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించి తల్లి పాల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ గౌరి,అంగన్‌వాడీ టీచర్ ఉష, ఆశ వర్కర్ పాల్గొన్నారు.

భామిని: తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యమని వైద్య సిబ్బంది తెలిపారు. శనివారం సొలికిరిలో తల్లిపాలు వారోత్సవాల్లో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ చంద్రశేఖర్‌తో పాటు వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సహారా బాధితుల నిరసన



పాచిపెంటలో నిరసన తెలుపుతున్న సహారా బాధితులు

పాచిపెంట: సహారాలో దాచుకున్న డబ్బులు తక్షణమే చెల్లించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలంటూ శనివారం పాచిపెంటలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. సీఐటీయూ నాయకులు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన చేశారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రెండున్నర కోట్ల మంది సహారా బాధితులు ఉన్నారని అన్నారు. ఎన్నో ఆందోళన కార్యక్రమాల తరువాత కేంద్ర ప్రభుత్వం స్పందించి దశల వారీగా చెల్లించేందుకు సిద్ధపడిందని చెప్పారు. ఇప్పటికీ పూర్తిస్థాయిలో పంపిణీ చేయలేదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

వర్షాలు లేక.. ప్రవాహం లేక

● నాగావళిలో తగ్గిన నీటినిల్వలు ● ఆందోళన చెందుతున్న రైతులు



నాగావళి నదిలో తగ్గిన నీటి ప్రవాహం

గరుగుబిల్లి: నాగావళినది బోసిపోతోంది. ఏటా వర్షాకాలంలో ఆగస్టు మొదటి వరానికి జలకల సంతరించుకునేది. కొన్నిసార్లు ప్రమాద స్థాయికి ఎగువన ప్రవహించేది. ఈ ఏడాది క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు అనుకున్న స్థాయిలో లేకపోవడంతో నదిలో వరద చేరలేదు. వర్షాకాలంలో నిండుకుండలా ఉండాల్సిన నదిలో ప్రవాహ జాడ కనిపించడం లేదు. కొద్దిరోజులు కురిసిన వర్షాలకు పైనుంచి వరద ప్రవాహం కొంతమేర చేరినా దిగువకు విడుదల చేసేవారు. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో నీటి నిల్వకోసం ప్రాజెక్టు అధికారులు చర్యలు చేపడుతున్నారు. తోటపల్లి ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను ప్రస్తుతం 103.96 మీటర్ల నిల్వ ఉంది. ప్రాజెక్టులో నీటి సామర్థ్యం 2.534 టీఎంసీలకు గాను ప్రస్తుతం 1.875 టీఎంసీల సామర్థ్యంఉంది. నదిలోకి పైనుంచి 1350 క్యూసెక్కుల నీరు చేరుతుండగా, నది గుండా 160 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగునీటి అవసరాలకు ప్రధాన కాలువల నుంచి 1190 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టడంతో సాగునీటి అవసరాలకు నిల్వ చేసేందుకు దృష్టి సారిస్తున్నారు. నీటి నిల్వలు పెంచేందుకు నది నుంచి సరఫరా తగ్గించినట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రస్తుత వర్షాకాలంలో నిండుకుండా ఉండాల్సిన నది వట్టిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

నేడు నాలుగో తరగతి ఉద్యోగుల సమావేశం

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణంలో మన్యం జిల్లాలో గల ప్రభుత్వ శాఖల నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బి.సూర్య నారాయణ, ఆర్.సింహాచలం శనివారం తెలిపారు. నూతన ప్రభుత్వానికి నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలను తెలియజేయనున్నట్లు చెప్పారు.

వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు

పార్వతీపురం టౌన్: జిల్లా కేంద్రంలోని బెలగాం కోవెల వీధిలో వేంచేసిన శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్ర గ్రూపు దేవాలయాల ఈవో ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 7వ తేదిన ఆండాళ్ అమ్మవారి తిరునక్షత్రం పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేయనున్నట్లు తెలిపారు. 16న రెండో శుక్రవారం వరలక్ష్మీవ్రతం, 19న రాఖీ పౌర్ణమి, 26, 27 వైష్ణవ శ్రీ కృష్ణ జయంతి సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అర్చన చేయనున్నట్లు తెలిపారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: కమిషనర్



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

పార్వతీపురం టౌన్: పారిశుధ్య నిర్వహణలో ప్రజారోగ్య శాఖ, సచివాలయ సంక్షేమ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు హెచ్చరించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. 30 వార్డుల్లో దోమలనివారణకు చర్యలుచేపట్టాలన్నారు. డంపింగ్‌యార్డు ఎదురుగా ఉన్న అంతర్రాష్ట్ర రహదారికి ఎదురుగా మొక్కలు నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు.

'ఎస్టీ వర్గీకరణ వేగవంతం చేయాలి'

సీతంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్టీ వర్గీకరణ వేగవంతం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా పోర్జ పైడి తెగ సంఘం జిల్లా నాయకులు గేదెల చిరంజీవి, గొర్లె జీవన్‌కుమార్ శనివారం కోరారు. శనివారం సీతంపేటలో పోర్జ పైడి సంఘ సభ్యులు నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ తమ కులాలు ఇప్పటికీ దుర్భర జీవితాలు గడుపుతున్నారని తెలిపారు. ప్రభుత్వపరంగా ఎటువంటి సంక్షేమ కార్యక్రమాలు అందడం లేదని వాపోయారు. ఎస్టీ వర్గీకరణ చేపడితే తమకు ప్రయోజనం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో గంటా మంజుల, పసుపురెడ్డి అర్జున్, గటా రాజారావు పాల్గొన్నారు.

గొల్లవానివలసలో పౌష్టికాహార ప్రదర్శన

గరుగుబిల్లి: గొల్లవానివలస అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. తల్లిపాల వారోత్సవాల ఆవశ్యకతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్లు గొట్టాపు సూర్యకుమారి, గొట్టాపు భవాని, రాజాన శారద, తూముల స్రవంతి ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్‌ను ఏర్పాటు చేశారు. కాయగూరలు, ఆకు కూరలు, పండ్లు తదితర వాటిని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు, సచివాలయ సిబ్బంది గుంట్రెడ్డి పుష్ప, అంగన్‌వాడీ సహాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహార ప్రదర్శనలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నీటి కోసం విద్యార్థుల ఇక్కట్లు



నీరు తెచ్చుకుంటున్న విద్యార్థులు

పాలకొండ: పాలకొండ నగర పంచాయతీ పరిధిలో ఇందిరానగర్ కాలనీ గిరిజన ఆశ్రమ పాఠశాలలో నీటి కోసం విద్యార్థులు నరకయాతన పడుతున్నారు. ప్రభుత్వం గిరిజన విద్యార్థుల కోసం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా ఈ దుస్థితి మారడం లేదు. బకెట్లు పట్టుకొని బోర్ల దగ్గరకు వెళ్లి నీటి కోసం గంటల కొద్దీ వేచి ఉండాల్సి వస్తోంది. అధికారులు చొరవ తీసుకొని సమస్యలు పరిష్కరించాలని గిరిజన విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కోటదుర్గమ్మ హుండీ ఆదాయం రూ.6.40 లక్షలు

పాలకొండ:పాలకొండలో కోటదుర్గమ్మ హుండీలను శనివారం లెక్కించారు. జూన్ ఒకటో తేదీ నుంచి శనివారం వరకు రూ.6,40,899 వచ్చినట్లు పార్వతీపురం మన్యం జిల్లా కార్యాలయం జూనియర్ సహాయకులు వై.ఇందిర, ఈవో మురళీకృష్ణ తెలిపారు. మిక్స్ బంగారం 8.500 మిల్లీ గ్రాములు, వెండి 700 మిల్లీ గ్రాములు వచ్చినట్లు వెల్లడించారు. విదేశీ కరెన్సీ వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ లెక్కింపులో ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీ ప్రసాదశర్మ, ఏపీజీవీ బ్యాంక్ అకౌంటెంట్ పి.స్వాతి, పోలీస్ సిబ్బంది త్రినాథరావు, గణపతిరావు, భక్తులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

●మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ విజయ్‌రాజ్‌కుమార్

పాలకొండ: ప్రభుత్వం అందిస్తున్న పథకాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ ఎ.విజయ్‌రాజ్‌కుమార్ సూచించారు. పట్టణంలోని సబ్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ కార్యదర్శుల ప్రత్యేక సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌రాజ్‌కుమార్ మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వపరంగా అమలులో ఉన్న పథకాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.సత్యనారాయణ, పి.మునిస్వామి, ఎం.వి.వెంకటేశ్వరరావు, ఎం.జగన్మోహన్‌రావు, గ్రామ పంచాయతీ సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలు అందించండి: ఆర్డీవో

పార్వతీపురం, ఆగస్టు3(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఉత్తమ సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆర్డీవో హేమలత సూచించారు. శనివారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో తహసీల్దార్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. రెవెన్యూ శాఖ ద్వారా అందించాల్సిన సేవలపై సమీక్షించారు. కొత్తగా నియాకమైన తహసీల్దార్లు వాటి గురించి తెలుసుకోవాలని ఆదేశించారు. పార్వతీపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న వారు.. సీని యర్లు అయినప్పటికీ ప్రభుత్వ లక్ష్యాల మేరకు పనిచేయాలని తెలిపారు. ప్రజ లకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని సూచించారు.

ఆసుపత్రి పనులు పూర్తి చేయండి

సీతంపేట: సీతంపేటలో 20 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న ఏరియా ఆసుపత్రి పనులు త్వరగా పూర్తి చేయాలని సీపీఎం నాయకులు ఎం.తిరుపతిరావు, పి.సాంబయ్య కోరారు.ఈ మేరకు శనివారం ఏరియా ఆసుపత్రి పనులు పరిశీలించారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ ఆసుపత్రి పనులు పూర్తికాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారని, వరండాలో ఒకే బెడ్ మీద ఇద్దరు చొప్పున వైద్యం అందించాల్సిన పరిస్థిత నెలకొందన్నారు. కార్యక్రమంలో భాస్కరరావు, శ్రీరాములు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం



పరిశుభ్రతపై వివరిస్తున్న అధికారులు

వీరఘట్టం: పరిశుభ్రతతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చుని ఎంపీడీవో ఎంవీటీ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎస్.గోపాలపురం కాలనీలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. గ్రామంలో ప్రజలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుదర్శనరావు, ఎంఎల్‌హెచ్‌పీ సునీత, పంచాయతీ సెక్రటరీ శ్యామలరావు, సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గంజాయిని నియంత్రించాలి



సంధ్యారాణిని కలిసిన ఎస్పీ

సాలూరు: గంజాయిని పూర్తి స్థాయిలో నియంత్రించాలని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఎస్పీకి ఆదేశించారు. తన నివాసంలో శనివారం ఎస్పీ మాధవరెడ్డి కలుసుకున్నారు. శాంతి భద్రతలు కాపాడాలని కోరారు. పలు విషయాలు ఆమే మాట్లాడారు.

●**కురుపాం:**ఎస్పీ మాధవరెడ్డిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్‌దేవ్ కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో గంజాయిలో ఉక్కు పాదం మోపాలని కోరారు.

ఎంపీకి అభినందన

పాలకొండ: విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును బీజేపీ నేతలు టంకాల దుర్గారావు తదితరులు రణస్థలంలో శనివారం కలిశారు. విజయనగరం, రాజాం, పాలకొండ, పర్లాకిమిడి, సీతంపేట, కొత్తూరు ఒడిశా మీదుగా రైల్వేమార్గం నిర్మించాలని పార్లమెంట్‌లో ప్రస్తావించడంతో అభినందించారు.

పాఠశాలకు మైక్ సెట్ వితరణ

కురుపాం: కురుపాం జడ్పీ ఉన్నత పాఠశాలకు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పల్ల సింహాచలం నాయుడు రూ.20 వేలు విలువచేసే మైక్ సెట్ అందజేశారు. శనివారం ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సోమేశ్వరరావుకు అందజేసారు.

వాహనాల తనిఖీ

వీరఘట్టం: వీరఘట్టం అంబేడ్కర్ జంక్షన్ వద్ద ఎస్ఐ ఎస్‌కె ఫ్రకుద్దీన్ శనివారం ద్విచక్ర వాహనాలు తనిఖీచేశారు. చలానా బకాయిలు ఉన్న వారు వెంటనే చెల్లించాలని కోరారు. ట్రాఫిక్ నియమాలను పాటించాలని, వాహనదారులకు తెలిపారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

కురుపాం:విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కురుపాం ఎస్ఐ షణ్ముఖరావు కోరారు. శనివారం స్థానిక వైరిచర్ల శోభతదేవి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కొత్త చట్టాలు, ఈవ్ టీజింగ్, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు.